కంది రైతుకు ధరాఘాతం

- ధర తగ్గడంతో ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



ట్రాక్టర్‌లో కొనుగోలు కేంద్రానికి తెచ్చిన కంది బస్తాలు



కందులను జల్లెడ పడుతున్న కూలీలు



తాడిపత్రి రూరల్: ఆశించిన ధర లేక కంది రైతులు నష్టాల పాలవుతున్నారు. ఆరుగాలం పండించిన పంట దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో వారిని మరింత ఆందోళనలకు గురిచేస్తోంది. తాడిపత్రి ప్రాంతంలోని తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో కంది పంటను కొందరు రైతులు అంతర పంటగా, మరి కొందరు పూర్తి స్థాయిలో సాగు చేస్తారు.

తగ్గిన దిగుబడి..

తాడిపత్రి ప్రాంతంలోని వివిధ మండలాల్లో సాగు చేసిన కంది పంట వాతావరణ పరిస్థితులు, తెగుళ్లతో దిగుబడి తగ్గింది. సకాలంలో సస్య రక్షణ చర్యలు తీసుకున్నా తెగుళ్ల ఉధృతి కారణంగా దిగుబడిపై ప్రభావం చూపింది. కంది పంటకు పూత దశలో వచ్చిన వాతావరణ పరిస్థితులు కూడా పంట దిగుబడిని తగ్గించాయి. ఈదురు గాలులు, అకాల వర్షాలు, ఆకాశం మబ్బులతో పూత రాలిపోయింది. అరకొర పూతతో వచ్చిన దిగుబడి వల్ల ఎకరాలకు నాలుగు బస్తాలకు మించి రాలేదు. వచ్చిన దిగుబడి, మార్కెట్‌లో ఉన్న ధరతో పోల్చితే ఎకరాకు రూ.10 వేలు నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం..

తాడిపత్రి మండలంలో పండిన కందికి స్థానిక మార్కెట్ మార్డులో యర్రగుంటపల్లి సింగిల్‌విండో సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రంలో క్వింటా బస్తాకు రూ.7,550 చొప్పున గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటంతో రైతులు కందిని కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్నారు. ఇక్కడ నెల వరకూ డబ్బులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది మార్కెట్‌లో క్వింటా రూ.10 వేలకుపైగా ధర పలికిందన్నారు. కొన్ని రోజుల క్రితం పెద్దపప్పూరు మండల కేంద్రంలో సింగిల్ విండో సొసైటీ ద్వారా కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినా.. ఆశించిన స్థాయిలో రైతుల నుంచి స్పందన రాకపోవడంతో మూసివేశామని అధికారులు తెలిపారు. యల్లనూరు మండలంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదని, పుట్లూరు మండలంలో కొనుగోలు కేంద్రం కొనసాగుతోందన్నారు.

క్వింటాల్‌కు 6 కిలోలకు పైగా తాలు..

స్థానిక మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో క్వింటాల్‌కు 6 కిలోలకుపైగా తాలు తీసేస్తున్నారని రైతులు వాపోతున్నారు. వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు ఇతర కారణాల వల్ల నాణ్యత కలిగిన పంట రాలేదు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని తాలు శాతాన్ని తగ్గించి కొనుగోలు చేసేందుకు సింగిల్ విండో అధికారులు ససేమిరా అంటున్నారు. నిబంధనల మేరకు కొనుగోలు చేస్తున్నామంటూ తాలును పట్టించుకోవడం లేదు. ట్రాక్టర్లు, వివిధ వాహనాల ద్వారా కొనుగోలు కేంద్రానికి తెచ్చిన కంది బస్తాలను దింపి అందులోని కందులను కూలీలు జల్లెడ పడుతున్నారు. తాలు శాతం పోగా మిగిలిన కందులను తూకం వేసి తీసుకుంటున్నారు. కొనుగోలు చేసిన కందులకు సంబంధించిన ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రైతుల ఫొటోలను సెల్‌ఫోన్‌లో తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు నేరుగా రైతుల ఖాతాల్లో పడేందుకే ఇటువంటి చర్యలు తీసుకుంటున్నామని సిబ్బంది తెలిపారు.

ఎకరాకు రూ.10 వేల నష్టం



10 ఎకరాల్లో కంది పంటను సాగు చేస్తే దిగుబడి 40 బస్తాల దిగుబడి వచ్చింది. అందులో తాలు పోతే దిగుబడి మరింత తక్కువగా ఉంటోంది. కొనుగోలు కేంద్రంలో తాలును తీసేసి కొనుగోలు చేస్తున్నారు. తగ్గిన దిగుబడితో ఎకరాలకు రూ.10 వేలు నష్టం వచ్చింది. మరోసారి కంది పంట వేయడానికి వెనుకడుగు వేయాల్సి వస్తోంది.

– వెంకటశివారెడ్డి, తిమ్మాపురం

ధర పడిపోయింది



గత ఏడాది కందులు క్వింటాల్ రూ.10వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది ధర గణనీయంగా పడిపోయింది. కొనుగోలు కేంద్రంలో క్వింటాల్ రూ. 7,550 ఇస్తున్నారు. ఈ ధరతో గిట్టుబాటు కావడం లేదు. కొనుగోలు కేంద్రంలో విక్రయించిన కందులకు డబ్బులు రావడానికి అధికారులు 15 రోజులు పడుతుందంటున్నారు.

– క్రిష్ణమూర్తి, యర్రగుంటపల్లి

నిబంధనల మేరకు కొనుగోలు

మార్క్‌ఫెడ్ నిబంధనల మేరకు కందులను కొనుగోలు చేస్తున్నాం. రెండు నెలలుగా రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటి వరకూ దాదాపు ఐదు టన్నుల కందులను కొనుగోలు చేసివివిధ ప్రాంతాల గోడౌన్‌లకు పంపాం. 15 రోజుల్లోపు రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయి.

– రాంనారాయణరెడ్డి, సొసైటీ సీఈఓ

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ నాయకులు

గుత్తి: ముస్లిం సమాజానికి పెను ముప్పుగా మారిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ముస్లింలు గుత్తిలో ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక నిజామీ షాదీ ఖానా వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్, శాంతిప్రియ ఆస్పత్రి, గాంధీ సర్కిల్ మీదుగా రాయల్ సర్కిల్ వరకూ ర్యాలీ సాగింది. వందలాది మంది ముస్లింలు ర్యాలీలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వక్ఫ్ బోర్డు బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీ సర్కిల్ వద్ద ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకం రఫీ, జాయింట్ సెక్రటరీ దస్తగిరి, కోశాధికారి నజీర్, గౌరవ సలహాదారులు మైనుద్దిన్, హుస్సేన్ పీరా, అన్వర్, ఉమర్, ప్రజా వైద్యశాల ఇస్మాయిల్ మాట్లాడారు. ముస్లిముల మనోభావాలను దెబ్బతీసేందుకు వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని అమలు చేశారన్నారు. ముస్లిలందరం ఏకమై వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేసే వరకూ ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముస్లిమ్ మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ కమిటీ సభ్యులు కోట ఫయాజ్, కటిక మున్వర్, డిష్ అన్వర్, కటిక అన్వర్, అజీజ్ ఖాన్, షఫి తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో ఘనంగా మట్టల ఆదివారం



గుత్తిలో ఈత మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

గుత్తి/పెద్దవడుగూరు/పామిడి: గుత్తిలో మట్టల ఆదివారం వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ సాల్మోన్ బాబు ఆధ్వర్యంలో చర్చి కమిటీ సభ్యులు, క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలు చేపట్టారు. ఈత మట్టలను చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం సీఎస్ఐ టౌన్ చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఈత మట్టలను చర్చిలో ఉంచి ఏసయ్యను ఆహ్వానిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సెక్రటరీ సురేంద్ర బాబు, కోశాధికారి మనోరంజిత, క్రైస్తవులు పాల్గొన్నారు.

▶▶ పెద్దవడుగూరులోని ఐఎస్ఈసీ చర్చిలో సంఘం సభ్యులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం కాపరి జాన్‌డేవిడ్, ఆనంద్, ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో ఈత మట్టలు చేత పట్టుకుని చర్చి చుట్టూ ప్రదక్షణలు చేస్తూ జయహో యేసు రాజా అంటూ నినాదాలు చేస్తూ మందిరంలో ప్రవేశించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

▶▶ పామిడి మండలంలోని పలు చర్చీలతో పాటు పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు ఈలోకానికి వచ్చారన్నారు. అంతకుముందు క్రైస్తవులు మట్టలు చేతబూని కీర్తనలు ఆలపిస్తూ ఆలయం చుట్టూ ప్రదర్శలు చేశారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, జకరయ్య, అబ్రహాం, రత్నరాజు, దేవదాసు, బుజ్జిబాబు, కరుణాకర్, రాజు, రత్నబాబు, ప్రభాకర్, ప్రసాద్, రజని, చంద్రకళ, సుశీలమ్మ, ప్రిస్కిల్లా, శాంతమ్మ, మాణిక్యమ్మ, ప్రశాంతి, రేచెల్, వాణి, రమాదేవి, అంజలి తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



పామిడిలోని సీఎస్ఐ చర్చిలో మట్టలు చేతబూని క్రైస్తవుల ర్యాలీ

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి



సేవా పురస్కారాలను అందుకున్న ప్రముఖులు

గుంతకల్లు: మహనీయులను ఆదర్శంగా తీసుకుని, వారి అడుగుజాడల్లో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సాయి డిగ్రీ కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మహనీయుల సేవా పురస్కార అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అవార్డులకు ఎంపికైన గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, కేబీ హాస్పటల్ వైద్యుడు మంజూర్, మణికంఠ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు సుధాకర్, విడపనకల్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గంగాధర్‌ను సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజ మార్పు సాధ్యమని భావించిన జ్యోతిరావుపూలే, డాక్టర్ అంబేడ్కర్, ఫెర్రర్‌లు అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని అణగారిన బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, నాయకులు సునీల్, శివరాజ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాలకు స్పందన



పామిడిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

శింగనమల: మండలంలోని పెరవళి గ్రామంలో గత ఆరు రోజులు నుంచి నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. రాయలసీమ అసోషియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా గంగిరెడ్డి స్వూరారెడ్డి సౌజన్యంతో బాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. శంకర్ నేత్రాలయ పుట్టపర్తి వైద్యుడు శంకర్ , అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అరుల్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి రోజూ 120 మందికి పైగా కంటి పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి అక్కడే ముబైల్ వ్యానులో శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరం 14వ తేదీ వరకు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

పామిడి: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి ఎస్.తిరుపతినాయుడు సారథ్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో బెంగుళూరు శంకర ఆస్పత్రి కంటి వైద్య నిపుణురాలు షీన 190 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 106 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్, ఉపాధ్యక్షుడు పట్రా శ్రీనివాసులు, కోశాధికారి షెక్షావలి, జిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శి రోషన్ జమీర్, డైరెక్టర్లు సురేష్, ముండే షెక్షావలి, గంగశేఖర్, శంకర ఆస్పత్రి ఆర్గనైజర్ శివ, లక్ష్మి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



బోరు ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ జబ్బార్ మియా

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ ఆధ్వర్యంలో గుంతకల్ రోడ్డులోని బ్రిడ్జి వద్ద బోరు ఏర్పాటు చేయించారు. బోరు ఏర్పాటు పనులను దగ్గరుండి కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఎలాంటి తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్యల తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

17 వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డి, అనగానదొడ్డి, పెద్దొడ్డి గ్రామాల్లో ఈ నెల 17 వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ఎస్పీడీసీఎల్ గుత్తి డీఈఈ పిశిలె షేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా సోమవారం నుంచి గురువారం వరకూ రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. రైతులు, ప్రజలు, వ్యాపార, వాణిజ్య సముదాయల వారు సహకరించాలని డీఈ విజ్ఞప్తి చేశారు.

నేడు అంబేడ్కర్ జయంతి

గార్లదిన్నె: మండల కేంద్రంలో అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీస్ నాయకుడు కదిరెప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకు మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్ వద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. ప్రజాసంఘాల నాయకులు, అంబేడ్కర్ వాదులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

క్లుప్తంగా

దుస్తులు, ఆట వస్తువుల వితరణ



అనాథలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కొత్తూరులో ఉన్న అనాథాశ్రమంలో ఉంటున్న అనాథ పిల్లలు, వృద్ధులకు ఆదివారం దుస్తులు, ఆట వస్తువులు వితరణ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు బళ్లారి రాజ్‌కుమార్ రెడ్డి, ఆయన కుమార్తె హేమశ్రీరెడ్డి, నాయకులు హరి, భాస్కర్ రెడ్డి, చిన్నా, రాజేష్, కిరణ్, షేక్షావలి, సుదర్శన్, బాషా, మల్లి తదితరులు ఆశ్రమంలో పిల్లలు, వృద్ధులకు దుస్తులతో పాటు ఆట వస్తువులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా ఆశ్రమానికి సహాయ సహకారాలు అందజేస్తానన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



సారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

గుంతకల్లు: మండలంలోని నక్కనదొడ్డి తండా గ్రామంలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు గ్రామంలో నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన రాజునాయక్, వెంకటేష్ నాయక్, లక్ష్మ నాయక్ నాటుసారా తయారు చేస్తున్నారని గుర్తించారు. తయారీ కేంద్రంపై దాడులు చేసి 510 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, వారి నుంచి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా పట్టణంలో దాడులు చేసి బోయ రమేష్ అనే వ్యక్తి వద్ద ఆరు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేశం, రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీకేఎస్‌లో గ్రామసభ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయం దగ్గర సోమవారం ఉదయం 10 గంటలకు సర్పంచ్ పార్వతి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

యాడికి: రేషన్ కార్డుల లబ్ధిదారులు ఈ నెల 30లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని సీఎస్ డీటీ సూర్యనారాయణ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంతవరకు 20 శాతం మంది ఈ-కేవైసీ చేయించుకోలేదన్నారు. వారంతా ప్రభుత్వం ఇచ్చిన గడువును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

‘కోటంక’లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారి ఆలయాల్లో..





ముసలమ్మ తల్లి, పెద్దమ్మ అమ్మవారు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి ఆలయం, పెద్దమ్మ తల్లి ఆలయంలో వెలసిన అమ్మవార్లకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ముసలమ్మ తల్లి, సచివాయం ఎదుట గ్రామంలో నడి ఒడ్డున వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయంలో దీపాలు పెట్టి అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ఊరి దేవర

పామిడి: మండలంలోని రామగిరి గ్రామంలో ఊరి దేవర కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు ఈశ్వర్, సోదరుడు శ్రీనివాసులు హాజరై ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



జే సబిత



పీ రూఫస్ జేవియర్ రాజు

పామిడి: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో పామిడి మండల విద్యార్థులు సత్తా చాటారు. ఖాదర్‌పేట గ్రామంలోని రైతు జే హనుమంతరెడ్డి కుమార్తె జే సబిత జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు 462 మార్కులు సాధించారు. అలాగే పామిడి పట్టణానికి చెందిన పీ రూఫస్ జేవియర్ రాజు జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు 438 మార్కులు సాధించారు. ప్రతిభావంత విద్యార్థులను పలువురు అభినందించారు.

మహిళపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లికి చెందిన ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా ఆదివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నల్లప్ప అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన పద్మావతి అనే మహిళను వ్యక్తిగతంగా దూషించాడు. ఈవిషయంపై ఇద్దరూ ఘర్షణ పడడంతో నల్లప్పకు రక్తగాయం కావడంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నల్లప్ప ఫిర్యాదు మేరకు పద్మావతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని దిమ్మగుడి గ్రామంలో అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న చాకలి శంకర్ అనే వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. కొద్ది రోజులుగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. అతడి నుంచి 8 బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

పరస్పరం దాడి..

ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీలో ఆదివారం విజయ్‌కుమార్, లక్ష్మి అనే ఇద్దరు ఘర్షణ పడ్డారు. పరస్పరం రాళ్లతో దాడి చేసుకోవడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చెల్లిపై సోదరుల దాడి



గాయపడిన అంజినమ్మ

బుక్కరాయసముద్రం: మండలంలోని చెన్నంపల్లిలో ఆస్తి కోసం చెల్లిపై ఇద్దరు సోదరులు దాడికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. చెన్నంపల్లిలో లక్ష్మీదేవికి కుమారులు చంద్ర, అంజి, కుమార్తె అంజినమ్మ ఉన్నారు. మద్యానికి బానిసైన కుమారులు తరచూ తల్లిని డబ్బులు, బంగారు ఇవ్వాలని వేధించేవారు. ఆదివారం డబ్బులు ఇవ్వక పోవడంతో లక్ష్మీదేవిపై కుమారులు దాడి చేసి కొడుతుండగా అడ్డు వచ్చిన కుమార్తె అంజినమ్మపై కూడా దాడి చేసి తీవ్రంగా కొట్టారు. దీంతో అంజినమ్మ చెయ్యి విరిగిపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





తీవ్రంగా గాయపడిన నరేష్, రామాంజనమ్మ

గుత్తి రూరల్: మండలంలోని టి.కొత్తపల్లి శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. యాడికి మండలం కోనుప్పలపాడుకు చెందిన నరేష్ తన సమీప బంధువులు బాట సుంకమ్మ వద్ద జాతర చేస్తుండటంతో బంధువు రామాంజనమ్మతో కలసి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. టి.కొత్తపల్లి క్రాస్ వద్ద ముందు వెళ్తున్న నరేష్ ద్విచక్రవాహనాన్ని అతడి సమీప బంధువు ఇగుడూరు గ్రామానికి చెందిన రామ్మోహన్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంతో వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం నరేష్‌ను అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.